బీసీ హక్కులను కాలరాస్తే ఊరుకోం

వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు

హాజరైన ప్రజలు

- **సమగ్ర కులగణన వెంటనే చేపట్టాలి**
- **కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి**
- **బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్**
- **బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి**
- **మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**
- **పెద్దపల్లిలో బీసీ సదస్సు**

పెద్దపల్లి, ఆగస్టు 13: 'అధికారంలో వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపడుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ నమ్మించింది. బీసీల ఓట్లు దండుకొని గద్దెనెక్కింది. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఆ మాటే మరిచిపోయింది. బీసీ హక్కులను కాలరాయాలని చూస్తే ఊరుకోం. బీసీలంతా ఏకమై బొందపెడతామని' బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంబీ గార్డెన్‌లో బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అధ్యక్షతన నిర్వహించిన బీసీ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'స్వాతంత్ర్యం వచ్చి 78 ఏండ్లయినా రాష్ట్రంలో బీసీ బిడ్డ ముఖ్యమంత్రి అయిండా..? అని ప్రశ్నించారు. ఓట్లు బీసీలవీ, సీట్లు అగ్రవర్ణాలవా..?, ఎందుకీ వివక్ష..?, బీసీలకు రాజ్యాధికారం వద్దా..?, ఇంకెన్నాళ్లీ కష్టాలు, కన్నీళ్లు, బానిస బతుకులు, ఇకనైనా తెగబడుదాం.. కలబడుదాం.. నిలబడుదాం, ఐక్యతతో పోరాటాలు చేస్తూ రాజ్యాధికారం చేపట్టే దిశగా అడుగులు వేద్దామని' పిలుపునిచ్చారు. అధికారంలో వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపడుతామని కాంగ్రెస్ నమ్మించి మోసం చేసిందని, వెంటనే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలన్నారు. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి సాధించాలంటే దేశంలో కులగణన చేపట్టాలని రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో డిమాండ్ చేస్తుంటే, రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నోరు మెదకపోవడం సిగ్గుచేటన్నారు. బీసీలం బానిసల్లా ఉండకుండా, రాజ్యాధికారం దిశగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీసీలను విభజించి పాలిస్తున్న అగ్రవర్ణాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. దేశానికి అన్నం పెట్టే బీసీలను అవమానపరిచిన, మన హక్కులను హరించిన ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయాలన్నారు. బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న హైదరాబాద్‌లో అఖిల పక్ష సమావేశం, 26న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, వచ్చే నెల 9న కులగణన మార్చ్ చేస్తామని వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే కులగణన అయినా చేపట్టాలి లేదా కుర్చీ అయినా ఖాళీ చేయాలనే నినాదంతో గ్రామగ్రామాన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సదస్సులో నాయకులు చామక్కర రాజు, రఘువీర్ సింగ్, గంట రాములు యాదవ్, పుట్ట శైలజ, కందుల సంధ్యారాణి, బండారి శ్రీనివాస్ గౌడ్, మారం తిరుపతి యాదవ్, ఉప్పరి శ్రీనివాస్, శిలారపు పర్వతాలు యాదవ్, మేకల సంపత్, రాజ్‌కుమార్, సంపత్, కొలిపాక శ్రీనివాస్‌తో అధిక సంఖ్యలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ లేకపోవడం అన్యాయం. మన మెంతో.. మనకంత రిజర్వేషన్ దక్కేలా బీసీ ఐక్యంగా ఉండి పోరాటం చేయాలి. దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థలు, చట్ట సభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి. బీసీ కుల గణన చేసిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. దేశంలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలను అభివృద్ధి చెందకుండా అగ్రవర్ణాలు అడ్డుకుంటున్నాయి. ఇప్పటికైనా అప్రమత్తం కావాలి.

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

బీసీలంతా ఏకం కావాలి..

ఉద్యమాల ఖిల్లా పెద్దపల్లి జిల్లా నుంచే బీసీలంతా పులిలా గర్జించా లి. మన ఐక్యత ఢిల్లీ పెద్దలకు తాకేలా గళం వినిపించాలి. స్వాతంత్ర్యం వచ్చి న తర్వాత నల్లదొరల పాలనలో బానిసల్లా బతుకుతున్నరు. వెనుకబడిన అగ్రవర్ణాలంటూ అగ్రవర్ణాల కోసం 10 శాతం రిజర్వేషన్ కేటాయించారు. కానీ జనాభా లో సగం మంది బీసీలుంటే వారి అభివృద్ధి, సం క్షేమం అగ్రవర్ణాల పాలకులకు పట్టదు. ఎందుకంటే చట్ట సభల్లో అగ్రవర్ణాల నాయకులే ఉంటారు. చట్ట సభల్లో బీసీలుంటనే బీసీలకు సామాజిక న్యా యం దక్కుతుంది. ఆ దిశగా అడుగులు వేద్దాం.

- చిరంజీవులు, రిటైర్డ్ ఐఏఎస్

నిరాహార దీక్ష చేస్తా

కులగణన బీసీల జీవితాన్ని మారుస్తుంది. భవిష్యత్తు తరాలకు బంగారు బాట వేస్తుంది. బీసీలు ఏకం కాకుండా అగ్రవర్ణాల కుట్రలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలి. సమగ్ర కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రానున్న స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలి. లేదంటే నిరాహార దీక్ష చేస్తా.

- రాజారాం యాదవ్, బీసీ జన సభ అధ్యక్షుడు

ఓట్లు మనవే.. సీట్లు మనవే..

పెద్దపల్లి నియోజకవర్గంలో దొరల పాలన సాగుతుంది. విభజించి పాలిస్తున్నరు. బీసీలను అణగదొక్కుతున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులనే గెలుపించుకుందాం. ఓట్లు మనవే.. సీట్లు మనవే నినాదంతో ముందుకుసాగాలె. దొరల గడీలను బద్దలు కొట్టాలే. అందుకు జిల్లాలోని బీసీలంతా ఏకతాటిపై రావాలె.

- కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్, పెద్దపల్లి

సెలవులొస్తే సర్కారు స్కూళ్లలోనే మకాం

తరగతి గదిలో పడేసిన ప్యాకెట్లు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు20: ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు వస్తే మద్యం ప్రియులకు అడ్డాలుగా మారుతున్నాయి. ఆది,సోమవారాల్లో సెలవులు రావడంతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇద్లాపూర్ ప్రభుత్వ పాఠశాల తాళం పగలగొట్టి అందులో మద్యం తాగారు. సిగరెట్ ముక్కలు, సారా ప్యాకెట్లు పడేసినట్లు హెచ్‌ఎం కేదాస్ తెలిపారు. పాఠశాలకు రెండు రోజులు సెలవులు రావడంతో పాఠశాలకు తాళం వేశారు. మంగళవారం పాఠశాల ప్రారంభం కావడంతో తరగతి గదికి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా తాగి పడేసిన సారా ప్యాకెట్ల కవర్లు, సిగరెట్‌ముక్కలు ఉన్నాయి.ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. కాగా ప్రభుత్వ పాఠశాల చుట్టూ బెల్టుషాపులు ఉన్నాయి. కొందరు ఆకతాయిలు రోజు పాఠశాల ఆవరణలోనే మద్యం తాగుతూ ఉంటారు. తాగి పడేసిన సిగరెట్ ముక్కలు చూస్తే గంజాయి సేవించిన అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై పోలీసులు ప్రత్యేక ధృష్టి సారించి ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన

జూలపల్లి, ఆగస్టు 20 ః స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులు మంగళవారం వార్డుల వారీగా ఓటర్ల విభజన ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో ఒకే వార్డు ఓటర్లు ఒకచోట ఉండేలా కసరత్తు చేస్తున్నారు. ఇక్కడ ఇన్‌చార్జి తాసిల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీవో సదానందం, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, కారోబార్ పాల్గొన్నారు.

రుణమాఫీపై దరఖాస్తుల స్వీకరణ

రామగిరి, ఆగస్టు 20: మండలంలో రుణ మాఫీపైమండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ దరఖాస్తులు స్వీకరించారు. మంగళవారం రత్నాపూర్, సుందిళ్ల, ఆదివారంపేట రైతు వేదికలో రుణమాఫీ కాని వారి వివరాలతో కూడిన దరఖాస్తులను రైతులు అందించారు. 98 గ్రీవెన్స్ దరఖాస్తులను స్వీకరించినట్లు ఏవో శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో గడి కందుల అరవింద్, నవీన్, మౌనిక పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
PLOT FOR SALE
★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325792-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

'నమస్తే' ఎఫెక్ట్...

ఏర్పాటు చేస్తున్న శిలాఫలకం

తీరబోతున్న కళ్యాణ్‌నగర్ కష్టాలు

కోల్‌సిటీ, ఆగస్టు 20: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన వ్యాపార కేంద్రాలైన కళ్యాణ్‌నగర్, లక్ష్మీనగర్ కష్టాలు త్వరలోనే తీరబోతున్నాయి. ఇటీవల నమస్తే తెలంగాణ దినపత్రికలో 'అవే గుంతలు... తప్పని తిప్పలు' శీర్షికన గోదావరిఖని కళ్యాణ్‌నగర్ రోడ్ల దుస్థితిపై ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ స్పందించారు. ఆ డివిజన్‌లో రోడ్ల దుస్థితిని మార్చేందుకు ముహూర్తం ఖరారు చేశారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని నగర పాలక అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ఆగమేఘాల మీద ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా రాత్రికి రాత్రే కళ్యాణ్‌నగర్ ప్రధాన చౌరస్తాలో రోడ్ల నిర్మాణం పనుల ప్రారంభానికి సంబంధించి శిలాఫలకం నిర్మాణం చేపట్టారు. దాదాపు రూ.26 కోట్లతో కళ్యాణ్‌నగర్, లక్ష్మీనగర్‌లో రోడ్ల పనులకు నిధులు కేటాయించారు. బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కళ్యాణ్ నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు. దీంతో ఆయా ఏరియాల వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

వెలిగిన హైమాస్ట్ లైట్

ఓడేడ్ లో వెలుగుతున్న హైమాస్ట్ లైట్

ముత్తారం, ఆగస్టు 20: ఓడేడ్ గ్రామంలోని బస్టాప్ ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ 30 రోజులుఆ వెలగడం లేదని 'నమస్తే'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఉన్నత అధికారులు సదరు కాంట్రాక్టర్ తో మాట్లాడి తన రావాల్సిన బిల్లును 10 రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. బస్టాప్ ఆవరణలో విద్యుత్ కాంతులు విరజిమ్మాయి.

ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

పెద్దపల్లి, ఆగస్టు20: పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏసీపీ జీ కృష్ణ అన్నారు. జంక్షన్ల అభివృద్ధి, మరమ్మతులు, ట్రాఫిక్ సిగ్నల్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, థర్మోప్లాస్టిక్ పెయింటింగ్, సైన్ బోర్డుల ఏర్పాటు, రోడ్డు ఆక్రమణల తొలగింపు, హైవేపై వేగాన్ని నియంత్రించడం, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు మంగళవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆర్ అండ్ బీ, పెద్దపల్లి మున్సిపల్ అధికారులు, హెచ్‌కేఆర్ రోడ్ లైన్స్ వారితో ఏసీపీ సమావేశమయ్యారు.చేపట్టాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, పెద్దపల్లి, సుల్తానాబాద్ సీఐలు ప్రవీణ్ కుమార్, సుబ్బా రెడ్డి, ట్రాఫిక్ సీఐ అనిల్, ఆర్ అండ్ బీ జేఈ నవీన్, హెచ్‌కేఆర్ రోడ్ లైన్స్ మేనేజర్ రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిని అరెస్ట్ చేయాలి

గోదావరిఖని, ఆగస్టు 20: దళిత కార్మికురాలు జనగామ స్వప్నను ఈ నెల 14న కులం పేరుతో దూషించి కొట్టిన ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి మడ్డి ఎల్లయ్యగౌడ్, అతని అనుచరులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసుతో పాటు హత్యానేరం కేసునమోదుతో అరెస్ట్ చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, ఎస్సీ ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బొంకూరి మధు, కేంద్ర కార్యదర్శి కొంకటి లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. దళిత కార్మికురాలుగా బొగ్గుగనిలో పనిచేస్తున్న స్వప్నను అణిచివేయాలనే ఉద్దేశంతో ఎల్లయ్యగౌడ్ ఇంటికి పిలుపించుకొని మాదిగ కులం పేరుతో తిట్టి కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కో కన్వనర్ గద్దల శశిభూషణ్, కల్వల సంజీవ్, మహేందర్, గొర్రె నర్సింగరావు, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు పోతన విజయ, కన్నూరి లక్ష్మీ, దొరగాండ్ల కమల, రాయమల్లమ్మ, సముద్రాల సునీత, అరుణ్, అరికిల్ల అంజమ్మ, తదితరులు ఉన్నారు.

ఫొటో గ్రాఫర్ కుటుంబానికి సాయం

పాలకుర్తి, ఆగస్టు20: బసంత్‌నగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ చొప్పరి ఓదెలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఓదెలు భార్య స్వరూప, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రాష్ట్ర ఫొటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.1.60 లక్షల చెక్కును, పాలకుర్తి మండల ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో రూ.33వేలు నగదు, ఓదెలు భార్య సుజాతకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి బాస్కర్, మండల అధ్యక్షుడు మాదాసు భూమయ్య, రామగిరి శ్రీనివాస్‌ఆ, శ్రీధర్, కల్వలరామ్‌కుమార్, బోగిరి లక్ష్మణ్, వైద్యనరేస్, తిరుపతి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 20: పట్టణంలోని మున్సిపల్ జంక్షన్ వద్ద మంగళవారం రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన సీఐ నెంబర్ ప్లేట్లు లేని వాహనాలకు జరిమాన విధించారు. అలాగే రాజీవ్‌రహదారిలో మంగళవారం ఓ కుక్క మృతదేహంను గుర్తించిన రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ అక్కడి నుంచి తొలగించారు. గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా కుక్క మృతిచెందగా ట్రాఫిక్‌కు అంతరాయ ఏర్పడకుండా సీఐ తన సిబ్బంది సాయంతో మృతదేహాన్ని తరలించారు.

51, 393 మంది రైతులకు రూ. 378 కోట్ల రుణమాఫీ

పెద్దపల్లి, ఆగస్టు20: రూ. 2 లక్షల రుణ మాఫీలో భాగంగా జిల్లాలోని 51, 393 మంది రైతులకు రూ. 378 కోట్ల రుణమాఫీ జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో రైతు రుణమాఫీ పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ రైతుల రుణాలు మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసినందున రుణమాఫీ ఫలాలు రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాంకుల్లో రుణమాఫీ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు కేంద్రాల ద్వారా రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించిపరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆది రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

లక్ష్మీ గణపతి క్వారీని సీజ్ చేయాలి

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 20: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కుర్మపల్లి శివారులో గల లక్ష్మీ గణపతి క్వారీలో కుందన్ కుమార్ (17) పై పెద్ద బండరాయి పడి మృతికి చెందాడని దీనికి కారణమైన లక్ష్మీ గణపతి క్వారీని తక్షణమే సీజ్ చేయాలని దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. జిల్లాలో ఏలాంటి ప్రమాదం జరిగిన లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సుల్తానాబాద్‌లోని రాజారాణి గోదాంలో నీతూ కుమార్ ప్రమాదవశాత్తు మృతి చెందితే మృతుని తండ్రికి రూ. లక్ష రూ. చేతులో పెట్టి మృతదేహాన్ని దహనం చేశారని తెలిపారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరిగిన వెంటనే సమగ్ర విచారణ చేసి భాద్యులపైన తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ కండే కరుణాకర్, దాసరి కిషన్, అలువాల ప్రశాంత్ ఉన్నారు.

విద్యుత్ వినియోగదారుల కోర్టులో 8 ఫిర్యాదులు

మంథని, ఆగస్టు 20: విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టులో 8 ఫిర్యాదు వచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. స్థానిక ఎస్‌ఎల్‌బీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఫోరం చైర్మన్ వేణుగోపాలచారి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులు ఓవర్ లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు, డ్యామేజీపోల్స్, ఆదనపు లైన్లు, సర్వీస్ పేరు మార్పిడి వంటి వాటికి సంబంధించిన 8 దరఖాస్తులు సమర్పించగా వాటిని వెంటనే పరిష్కరించాలని చైర్మన్ వేణుగోపాలచారి ఆదేశాలు జారీ చేశారు. పెద్దపల్లి సూపరింటెండెంట్ ఇంజినీర్ బొంకూరు సుదర్శనం, డివిజనల్ ఇంజినీర్ ఈశ్వర్ ప్రసాద్, మంథని, ఎక్లాస్‌పూర్, ముత్తారం, బేగంపేట, కమాన్‌పూర్, ఏఈలు సీహెచ్. మల్లయ్య, శ్రీధర్, హనుమాన్‌దాస్, సతీష్, రాజేందర్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంథని, ఆగస్టు 20: పట్టణంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమా సురేశ్ రెడ్డి మంగళవారం వెల్లడించారు.వివిద అభివృద్ధి పనులకు తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిధుల కింద రూ. 13.95 కోట్లతో మంథని పురపాలక సంఘం 13వార్డుల పరిధిలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమంతో పాటు 15వ ఆర్థిక సంవత్సరం నిధుల ద్వారా రూ.24.05లక్షలతో మూడు స్వచ్ఛ ఆటోల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గాంధీచౌక్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు.

వోల్వో డ్రైవింగ్ శిక్షణ ప్రారంభించిన జీఎం

గోదావరిఖని, ఆగస్టు 20: సింగరేణి ఆర్జీ-1 సీఎస్ఆర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ఓసీపీలో నడిచే వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణను టీటీసీలో ఆర్జీ-1 జీఎం డీ లలిత్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. శిక్షణ అనంతరం 46రోజులు ట్రైనింగ్‌తో వోల్వో డ్రైవింగ్, ఫీడ్‌బ్యాక్ క్లాసులతో వోల్వో ఆపరేటర్‌గా గుర్తింపు సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. ఇక్కడ ఏఐటీయూసీ జాయింట్ సెక్రెటరీ రంగు శ్రీను, సీఎంఓఏఐ వైఎస్ ప్రెసిడెంట్ మల్లేశ్, ఎస్‌వోటు జీఎం రాంమోహన్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, టీటీసీ అశోక్‌రావు, వోల్వో కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ హరిబాబు, వీటీసీ మేనేజర్ డినీల్, సీనియర్ పీఓ హర్మంతరావు, రామయ్య ఉన్నారు.

పిడుగుపాటుతో ఒకరి మృతి

మంథని రూరల్, ఆగస్టు 20: కన్నాల పంచాయతీ పరిధిలోని పందులపల్లి గ్రామానికి చెందిన ఉడుత నారాయణ అనే రైతు సోమవారం రాత్రి పిడుగుపాటుతో మృతి చెందాడు. మంథని ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పనుల నిమిత్తం సోమవారం రాత్రి పొలం వద్దకు వెళ్తున్న నారాయణ పిడుగు పాటుతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా మైసమ్మ తల్లి బోనాల ఉత్సవం

కోల్‌సిటీ, ఆగస్టు 20: గోదావరిఖని ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద గల మైసమ్మ తల్లి ఆలయం మూడో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మైసమ్మకు పట్నాలు వేసి, బోనాలు సమర్పించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ మైసమ్మకు నైవేద్యం సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు కార్పొరేటర్లను మార్కెట్ కమిటీ నాయకులు సన్మానించారు. అనంతరం మైసమ్మ తల్లి బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్త పంచాయతీల ఏర్పాటుపై హర్షం

మంథని, ఆగస్టు 20: మంథని, ముత్తారం మండలాల్లో కొత్త పంచాయతీల ఏర్పాటుకు కృషి చేసిన జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు మాజీ జడ్పీటీసీ తగరం సుమలత, ముత్తారం మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, బీఆర్ఎస్ నాయకులు వేగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, పీ కిషన్‌రెడ్డి, గుజ్జుల రాజిరెడ్డి, నూనె కుమార్, రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త పంచాయతీల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లెలపల్లి, తోటగోపయ్య పల్లె గ్రామాల ప్రజలు తమ రెండు గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని అప్పటి జెడ్పీ చైర్మన్‌ను కోరగా ఆయన ప్రతిపాదనల మేరకు అప్పటి ప్రభుత్వం జూలైలో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. జిల్లెలపల్లి, తోటగోపయ్యపల్లిలను పంచాయతీలుగా అధికారికంగా ప్రకటించారన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మంథని రూరల్, ఆగస్టు 20: దుబ్బపల్లి శివారులోని పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేసి, ఏడుగురిని పట్టుకున్నట్లు పెద్దపల్లి టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ బాబు, ఎస్ఐ రవిప్రసాద్ తెలిపారు. వారి నుంచి ఏడు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు, రూ. 20,390 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని మంథని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయండి

గోదావరిఖని, ఆగస్టు 20: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ బుధవారం మాల మహానాడు ఇచ్చిన భారత్‌బంద్‌ను విజయంతం చేయాలని మాల మహానాడు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర నాయకుడు దాసరి దశరథం పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ప్రధాన చౌరస్తాలోని కార్యాలయంలో నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపాఉ. బంద్‌కు వ్యాపార వాణిజ్య రంగాలకు చెందిన అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. ఇక్కడ నాయకులు పిట్టల వెంకటి, నంది నగేశ్, ఎరుకల లింగమూర్తి, లక్ష్మణ్‌రావు, అప్పల పోషం, మాలెం మధు, సోగాల వెంకటి, దాసరి రమేఫ్, బొమ్మక వెంకటేశ్వర్లు, కొండ కుమార్ ఉన్నారు.

మంథని, ఆగస్టు 20: ఎస్సీల వర్గీకరణ వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకులు దాసరి దశరథం, నూకల బానయ్యలు కోరారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణపై ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు పునఃసమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు అప్పల పోచయ్య, జంజర్ల రాజు, ఆర్ల జ్ఞాని, బడికెల నర్సయ్య, సుంకె రామ్మూర్తి, దాసరి గట్టయ్య, కొవ్వూరి వేణు ప్రసాద్, బొడ్డెల ఆనంద్, పోనుగంటి రమేశ్, రాదండి శంకర్, జంజర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దొరికిన బంగారు కడెం తిరిగి అప్పగింత

రామగిరి, ఆగస్టు 20: రత్నాపూర్ గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కట్కూరి శంకరయ్య నిజాయితీ చాటుకున్నాడు. శంకరయ్య సెంటినరీకాలనీలోని శ్రీ కోదండ రామాలయం, షిర్డీ సాయిబాబా ఆలయంలో సేవకునిగా పని చేస్తున్నాడు. మంగళవారంఆలయం నుంచి తన ఇంటికి వెళ్తుండగా పన్నూరు ప్రధాన చౌరస్తాలో అతనికి బంగారు కడియం దొరికింది. దాని విలువ దాదాపు రూ.80వేల దాకా ఉంటుంది. కొద్ది సేపటికి బాధితులు అక్కడకు చేరుకొని బంగారం పడిపోయిన చోట వెతుకుతుండగా ముత్తారం మండలానికి చెందిన గుడికందుల విజ్జన్న వారిని పిలిచి పలానా వాళ్లకు మీ బంగారం దొరికిందని ఆచూకీ చెప్పాడు. దీంతో బాధితులు శంకరయ్యను కలవగా, తన వద్దే బంగారం భద్రంగా ఉందంటూ ఆ బంగారం తీసుకవచ్చి బాధితులకు అప్పగించాడు. దీనితో బాధితులు ఊపిరి పీల్చుకొని శంకరయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 20 : సీజనల్ వ్యాధులపట్ల కార్మికులు, కార్మిక కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని సెక్టార్-3 వైద్యాధికారిణి పద్మ సూచించారు. మంగళవారం డిస్పెన్సరీలో వైద్య పరీక్షలకు వచ్చిన కార్మికులు, కార్మిక కుటుంబాలకు సీజనల్ వ్యాధులపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

రుణమాఫీ కోసం రైతుల ఆందోళన

పాలకుర్తి, ఆగస్టు20: జయ్యారంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ముడిమడుగుల మల్లయ్య ఆధ్వర్యంలో పంట రుణాలు మాఫీ కాని రైతులు ఆందోళన చేశారు. ఈసాలతక్కళ్లపల్లి ఇండియన్ బ్యాంకు పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి, కొత్తపల్లి, పాలకుర్తి, గుడిపల్లి, జయ్యారం, పుట్నూర్ , రామారావుపల్లి గ్రామాలకు చెందిన అర్హులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. సాంకేతిక కారణాలు సాకుగా చూపెడుతు బ్యాంకు పరిధిలోని 771 మంది రైతులకు రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. రుణమాఫీ చేయకపోతే బ్యాంకు ముట్టడిస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట జయ్యారం మాజీ ఉపసర్పంచ్ గాజుల అయిలేష్ యాదవ్, పలువురు రైతులు ఉన్నారు.

పర్సనల్ విభాగాధిపతిగా బాధ్యతల స్వీకరణ

రామగిరి, ఆగస్టు 20: సింగరేణి ఆర్జీ-3 ఏరియా పర్సనల్ విభాగాధిపతిగా నియమితులైన బీ.సుదర్శనం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇక నుంచి ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల అధికార ప్రతినిధిగా కూడా కొనసాగనున్నారు. అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో ఫారెస్ట్రీ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న బానోతు కర్ణ ఆర్జీ-1 ఏరియాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఎస్‌వోటు జీఎంలు రఘుపతి, సత్యనారాయణ,ఇంజినీర్లు శేఖర్‌బాబు, యాదయ్య, శ్రీనివాసులు, వెంకటరమణ, చంద్రశేఖర్, సుధాకర్, జనార్దన్ రెడ్డి, ఐలయ్య, కోల శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు..

పంచాయతీ ఏర్పాటు పై గ్రామస్తుల హర్షం

ముత్తారం, ఆగస్టు 20: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీలోని జిల్లలపల్లి గ్రామాన్ని కొత్త పంచాయతీగా ప్రకటించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గతంతో జడ్పీ చైర్మన్ గా ఉన్న పుట్ట మధుకర్ జిల్లలపల్లి గ్రామాన్నికొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాడని గుర్తు చేసుకున్నారు . ఇప్పుడున్న మంథని ఎమ్మెల్యే, స్థానిక మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆమోదంతో తమ గ్రామాన్ని కొత్త గ్రామపంచాయతీగా ప్రకటించడంపై ఎంతో సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామప్రజలు ఇరువురికి కృతజ్ఞతలు తెలిపారు.